విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 14న నుంచి కామన్ డైట్ అమలు

పెద్దపల్లి, డిసెంబర్12: ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ , మోడల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ , మోడల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలు పై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14న కామన్ డైట్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు తల్లిదండ్రులను ఆహ్వానించి లంచ్ ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్టళ్లలో కామన్ డైట్ వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని వసతి గృహాల్లో ఒకే రకమైన భోజనం విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం ప్రభుత్వం పెంచిందని చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద ఒకే డైట్ ప్లాన్ అమలు అవుతుందని, పిల్లలకు పౌష్టికాహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే రంగారెడ్డి, డీఈవో డీ మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అరుణ శ్రీ, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై సర్వే చేయాలన్నారు. ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని సర్వే చేపట్టాలన్నారు.

సర్కారు స్కూళ్లలో ఫేషియల్ అటెండెన్స్

- విద్యాశాఖలో కొత్త విధానం అమలు
- పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లా

పెద్దపల్లి,డిసెంబర్12(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఇందులో భాగం గా సర్కారు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఫేషియల్ అటెండెంట్స్ అమలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా పెద్దపల్లి జిల్లా ఎంపికైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 7 బీసీ గురుకులాలు, 11 ఎస్సీ గురుకులాలు, ఎస్సీ, మైనార్టీ, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూళ్లు, 361 ప్రాథమిక, 83 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలు, 10 కేజీబీవీలు, టీఆర్ఐఈఎస్, యూఆర్ఎస్‌లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు యాప్‌లో నమోదు చేయనున్నారు. ఇకపై టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాఠశాలలోకి వచ్చినప్పుడు, వెళ్లే సమయంలో ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేయనున్నారు. ఈ విధానాన్ని అమలు చేయడంతో పాఠశాల విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రానున్నాయి.ఉపాధ్యాయ, ఉద్యోగుల కచ్చితమైన హాజరుపై ఉన్నత అధికారులకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల గైర్హాజను పూర్తిగా నిరోధించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోఅమలు తర్వాత ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఫేషియల్ అటెండెన్స్ అమలు చేయనున్నారు.

శిశు మరణాలను తగ్గించాలి

పెద్దపల్లి, డిసెంబర్12: జిల్లాలో శిశు మరణాలను తగ్గించాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిశు మరణాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. శిశు మరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడారు. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు జిల్లాలో శిశు మరణాలు 35 నమోదైనట్లుతెలిపారు. భవిష్యత్తులో పిల్లల మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కే శ్రీధర్, వైద్యులు కిరణ్ కుమార్, టీ రవీందర్, స్రవంతి, వీ పద్మ పాల్గొన్నారు

పరామర్శ

జూలపల్లి, డిసెంబర్ 12 : కుమ్మరికుంటకు చెందిన సాగంటి ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ గురువారం పరామర్శించి ఓదార్చారు. 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేలు అందజేశారు. జూలపల్లిలో తుమ్మ రాజేశ్వరి మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. సంస్థ తరపున రూ. 5 వేలు అందించి ఉదారతను చాటుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ విశారపు వెంకటేశం, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, కొత్త శ్రీధర్, లాల్‌మహ్మద్, తీగల సతీశ్, అంకూస్, మేర శ్రీనివాస్, ఆవుల గోపాల్, మేర్గు రమేశ్ ఉన్నారు.

భద్రతా పక్షోత్సవాలు

గోదావరిఖని, డిసెంబర్ 12: జీడీకే 11ఇంక్లైన్‌లో గురువారం 55వ వార్షిక భద్రత పక్షోత్సవాలు జరిగాయి. జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, జీఎం హెచ్ఆర్‌డీ హబీబ్ హుస్సేన్, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ మాట్లాడారు. సంస్థలో ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన నియమాలను పాటిస్తూ ఉత్పత్తికి పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గని ఏజెంట్ శ్రీనివాస్ చేతుల మీదుగా అధికారులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను బహుమతిగా అందజేశారు. కార్మికులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఇక్కడ గని మేనేజర్ మల్లేశ్, సేఫ్టీ ఆఫీసర్ మహేశ్, వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, గుర్తింపు సంఘః నాయకులు ఆర్జీ–1 బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, కార్మికులు ఉన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంచడానికే 'పల్లె నిద్ర'

రామగుండం సీపీ శ్రీనివాస్

అవగాహన కల్పిస్తున్న సీపీ శ్రీనివాస్

జూలపల్లి, డిసెంబర్ 12 : పోలీస్ శాఖ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెంచడానికి 'పల్లె నిద్ర' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. జూలపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు, రికార్డులు, రిజిష్టర్లు, స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పల్లె నిద్రలో పోలీసులు ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మండలంలో నేరాల నమోదు శాతం తగ్గిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలిగేడులో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు తాత్కాలిక భవన సముదాయాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. స్టేషన్‌కు పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయింపునకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. ఇక్కడ పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ నరేశ్‌కుమార్, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు.

వజ్రవాహనంపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 12: నూతన సాయుధ దళ(ఎఆర్) కానిస్టేబుళ్లకు కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో వజ్ర వాహనంపై రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ గురువారం అవగాహన కల్పించారు. స్మోక్, స్టన్ గ్రనేడును వినియోగించే తీరును సీపీ ఫైర్ చేసి చూపించారు. అల్లరి మూకలను చెదరగొట్టేందుకు వజ్రా వాహనం ద్వారా ఏడు సెల్స్ ఉపయోగించి ఫైర్‌తో పరిస్థితిని చక్కదిద్దవచ్చని వివరించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఏఆర్ ఏసీపీ సుం దర్ రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమన్వయ లోపం

- పరస్పరం ఫిర్యాదులు
- సీడబ్ల్యూసీ గోదాంకు 40 క్వింటాళ్ల బియ్యం తరలింపు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్12: జిల్లాలోని పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ డీలర్లకు సీడబ్ల్యూసీ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్తున్న బియ్యం సరఫరాలో తగ్గుదల (తరుగు) రావడం కొంత మంది రేషన్ డీలర్లకు సమన్వయం లేకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారంటూ గురువారం పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణరావుకు, మీడియాకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. ఎస్ఐ లక్ష్మణరావు బియ్యం లోడు డీసీఎం వ్యాన్‌ను రంగంపల్లి వద్ద నిలిపి డ్రైవర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీలర్లకు సరఫరా చేసే బియ్యం తరుచూ కొరత (తక్కువగా) రావడం కారణంగా కొంత మంది కావాలనే తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిసింది. డీలర్లకు బియ్యం తరలింపులో తరుగు వస్తున్నాయనే అనుమానంతో వ్యాన్‌ను రంగంపల్లిలోని ధర్మకాంటకు తీసుకు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 40 క్వింటాళ్ల బియ్యాన్ని పరిశీలించి గోదాం ఇన్‌చార్జి సమాచారం అందించారు. బియ్యం గోదాంకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పకడ్బందీగా గ్రూప్ -2 పరీక్షలు

పెద్దపల్లి, డిసెంబర్ 12: ఎటువంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా గ్రూప్ –2 పరీక్షలు నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రూప్ –2 పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గురువారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అరుణ శ్రీ మాట్లాడారు. ఈనెల 15, 16 తేదీల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు రెండు సెషన్లలో గ్రూప్ –2 పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 9,018 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 18 పరీక్ష కేంద్రాలకు రీజనల్ కో –ఆర్డినేటర్‌గా లక్ష్మీ నర్సయ్యను నియమించినట్లు వివరించారు. ఎస్కార్ట్ లేకుండా ప్రశ్నాపత్రాలు వస్తే పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తీసుకోవద్దని సూచించారు. పోలీస్ బందోబస్తుతోనే ప్రశ్నాపత్రాలను తరలించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏసీపీ ప్రతాప్, రీజినల్ కో –ఆర్డినేటర్ లక్ష్మీ నర్సయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ప్రకాశ్, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని, డిసెంబర్ 12: ఈ నెల 23న స్థానిక జవహర్ లాల్ నెహ్రూ క్రీడామైదానంలో సింగరేణి ఆవిర్భావ వేడుకలను శాఖల వారీగా అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో అన్ని గనులు, డిపార్టుమెంట్స్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జీఎం మాట్లాడారు. ఇక్కడ ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, ఎజీఎం ఐఇడి ఆంజనేయులు, ఏసీఎంవో కిరణ్ రాజ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీబాయి, డివైఎస్‌సీ వరప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, అధికారులు శ్రీనివాస్, జితేందర్ సింగ్, కర్ణ, వీరారెడ్డి ఉన్నారు.

భద్రతా ప్రమాణాలను పాటించాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 12 : సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని జీఎం (ఎక్స్‌ప్లోరేషన్) దేబులాల్ బైద్య సూచించారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా ఓసీపీ–1 సైట్ కార్యాలయంలో గురువారం ఆయన ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. సింగరేణిలో సీవోపీ, ఎస్‌వోపీల ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. అనంతరం ట్రేడ్స్‌మెన్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎం ఎన్ సుధాకర్ రావు, పీవో జింగేటి రాజశేఖర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, భద్రతా తనిఖీ సభ్యులు షేక్ మిన్హాజుద్దీన్, వీరన్న, ఎల్ దయాకర్, ఎం ప్రసాద్, పీ ఆదినారాయణ, ఎం మురళీకృష్ణ, ఎం ప్రభాకర్ రెడ్డి, జీ సమ్మయ్య, ఆర్ రాజేందర్, గని మేనేజర్ ఉదయ్ హరిజన్, డీజీఎం (సీహెచ్‌పీ) కాశీ విశ్వేశ్వర్‌రావు, భద్రతా అధికారి పీ శ్రీనివాస్‌రావు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో ఆటోల బంద్

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 12: రాఘవాపూర్‌లో గురువారం నుంచి ఆటోలు బంద్ పాటిస్తున్నాయి. ఆటో యజమానులు, డ్రైవర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన బొబ్బిలి సత్యనారాయణ ప్రెస్ రిపోర్టర్ పేరిట తమను వేధిస్తున్నాడని, ఒక్కో ఆటోకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నదాంట్లో బతుకులు వెళ్లదీస్తుంటే సత్యనారాయణ మాటను వినలేదని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. కలెక్టర్, రవాణా శాఖ అధికారులకు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు మాటు వేసి మరీ ఇండ్ల చుట్టూ కాపు కాసి ఆటోలపై కేసులు పెడుతున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆటో యూనియన్ అధ్యక్షుడు కొడపత్రి శ్రీనివాస్, సభ్యులు కోనేటి సదయ్య, అర్కుటి రమేశ్, బొబ్బిలి, అన్నం ప్రభాకర్‌లతో పాటు పలువురు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పాలకుర్తి, డిసెంబర్12: పుట్నూర్, కుక్కలగూడూర్‌లోని ఎరువుల విక్రయ దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు నాణ్యమైన మందులు విక్రయించాలని కోరారు.

ఎంజాయ్‌మెంట్ సర్వేలో అక్రమాలు

రామగిరి, డిసెంబర్ 12: సింగరేణి సంస్థ ఓసీపీ గని తవ్వకాల కోసం ముస్త్యాల, సుందిళ్లఓ రెవెన్యూ అధికారులు చేపట్టిన ఎంజాయిమెంట్ సర్వేలో అక్రమాలు జరిగినట్టు భూ నిర్వాసితుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎంజాయిమెంట్ సర్వే లో తమ భూములపై కొందరు బినామీలు పరిహారం కోసం ఒకరి భూమిపై ఇద్దరు, ముగ్గురు పేర్లు నమోదై ఉన్నాయనీ, ఇదెలా సాధ్యమైందని భూ నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. తమ భూములపై బినామీలు ఏలా పుట్టుకొచ్చారనీ, దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి అక్రమాలపై విచారణ జరిపించి నిజమైన భూములు కోల్పోతున్న వారిని మాత్రమే గుర్తించి పరిహారం అందించాలని కోరారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా, ఆయా గ్రామాల్లో జరిగిన సర్వేలో ఏలాంటి అక్రమాలు జరగలేదన్నారు. ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.

NT-338978-All

LOST

తేది: 25-11-2024, సోమవారం రోజున గోదావరిఖనిలోని జిరాక్స్ సెంటర్ నుండి మా ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ (నెం: 6092/1991) పోయినది. దొరికిన వారు సంప్ర: పిట్టల సదానందం, S/o. రాయమల్లు. సెల్: 99592 61561.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

ధర్మారం,డిసెంబర్ 12: మేడారంలోని బాలుర గురుకుల విద్యాలయం ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. పురుషుల విభాగంలో కబడ్డీ పోటీల్లో లంబాడి తండా (బీ) జట్టు విన్నర్ గా, దొంగతుర్తి జట్టు రన్నర్‌గా, ఖోఖో పోటీల్లో మేడారం జట్టు విజేతగా, లంబాడి తండ (బీ) జట్టు రన్నర్‌గా, వాలీబాల్‌లో కమ్మర్ ఖాన్ పేట జట్టు విజేతగా, మేడారం జట్టు రన్నరప్ నిలిచాయి. మహిళ విభాగంలో కబడ్డీ పోటీల్లో నంది మేడారం జట్టు విన్నర్‌గా, మల్లాపూర్ జట్టు రన్నర్‌గా, ఖోఖోలో మేడారం జట్టు విన్నర్‌గా, మల్లాపూర్ జట్టు రన్నర్ గా, వాలీబాల్‌లో మల్లాపూర్ జట్టు విన్నర్ గా, కటికనపల్లి జట్టు రన్నర్ గా నిలిచినట్లు అధికారులు ప్రకటించారు. విజేత జట్లకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మండల ప్రత్యేక అధికారి వీర బుచ్చయ్య, తహసీల్దార్ ఎండీ ఆరిఫొద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో ఛాయాదేవి, ఎంపీవో రమేశ్, గురుకుల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రావు, పీఈటీలు సౌజన్య, గట్టయ్య ,శ్రీధర్, నర్మద, భాగ్యలక్ష్మి, స్రవంతి, స్వరూప పాల్గొన్నారు.

జూలపల్లి, డిసెంబర్ 12 : జూలపల్లి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం సీఎం కప్–2024 మండలస్థాయి క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 18 ఏళ్లలోపు క్రీడాకారులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఇక్కడ ఎంఈవో సరస్వతి, ఎంపీవో అనిల్‌రెడ్డి, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, హెచ్ఎం లక్ష్మణ్, పీఈటీలు పాల్గొన్నారు.

జ్యోతినగర్, డిసెంబర్ 12: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం సీఎం కప్ రామగుండం మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. హెచ్ఎం జయరాజు పోటీలను ప్రారంచారు. ఓపెన్ కేటరిటీలో కబడ్డీ, ఖోఖో పోటీలు, అండర్ 18 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం కబడ్డీ పోటీలో తిలక్‌నగర్ జట్టు విజేతగా, కాకతీయ యూనియన్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖోఖోలో గోదావరిఖని ప్రభుత్వ హైస్కూల్ ప్రథమ స్థానం, ఎంజేపీ రామగుండం ద్వితీయ స్థానం, మహిళల కబడ్డీ పోటీల్లో ఎంజేపీ రామగుండం ప్రథమ స్థానం, రామగుండం జడ్పీహెచ్ఎస్ ద్వితీయస్థానం, ఖోఖోలో ఎన్టీపీసీ జడ్పీ హైస్కూల్ ప్రథమస్థానం, గోదావరిఖని జడ్పీ హైస్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతర్గాం, డిసెంబర్ 12: మండలంలోని టీటీఎస్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఎంపీడీవో వాజిద్ అలీ, ఎస్ఐ వెంకటస్వామి పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరవధిక దీక్ష

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 12 : ఎన్నికల ముందు వరంగల్‌లో ఇచ్చిన మాట ప్రకారం తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు డిమాండ్ చేశారు.. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి, ఏడాది కాలం గడిచినా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మూడు రోజులుగా టీఎస్ఏస్‌యూఎస్ (తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం) ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. గురువారం చేపట్టిన దీక్షలో ఉద్యోగులు మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న పే స్కేల్ ప్రకారం జీతాలు, ఇతర ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల దీక్షకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇక్కడ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి రవిరాజ్, కుంబాల సుధాకర్, తాళ్లపల్లి మల్లన్న, వెంకటేశం, సంధ్యారాణి, రాజ్‌కుమార్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆగదు

సుల్తానాబాద్, డిసెంబర్ 12 : ఎంత మంది వివేక్‌లు వచ్చినా ఎస్సీ వర్గీకరణ ఆగదని, మంత్రి పదవి కోసమే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ హైదరాబాద్‌లో మాల మహానాడు సభ నిర్వహించారనీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండ థామస్ అన్నారు. స్థానిక ఐబీ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులతో సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఒకే కుటుంబానికి మూడు సీట్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సుల్తానాబాద్‌లో పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఈ సభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతాయరని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయంలో పూజలు

మంథని, డిసెంబర్12: మంథనిలోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

వేముల అశోక్‌కు అండగా ఉంటాం

కోల్‌సిటీ, డిసెంబర్ 12: ఇటీవల ఓల్డ్ అశోక థియేటర్ స్థలం ఆవరణలోని దుకాణం కూల్చివేసిన ఘటనలో బాధితుడు వేముల అశోక్ పక్షాన అండగా ఉంటామని తెలంగాణ లఘు చిత్రాల నిర్మాతల మండలి, తెలంగాణ షార్ట్ ఫిలిం మేకింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం అశోక్‌ను కలిసి ధైర్యం చెప్పారు. అశోక్‌కు జరిగిన నష్టానికి న్యాయం జరిగే దాకా మద్దతుగా వెన్నంటి ఉంటామని మండలి అధ్యక్షుడు అశోక్ రావు, కోశాధికారి చిరంజీవి రెడ్డి, కనవేని శ్రీనివాస్, సత్తన్న తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్తామని, అప్పటికి న్యాయం జరగకపోతే ఉద్యమం చేద్దామని భరోసా ఇచ్చారు.

ఓసీపీ -5లో సమావేశం

గోదావరిఖని, డిసెంబర్ 12: జీడీకే ఓసీపీ–5లో గురువారం మల్టీ డిపార్ట్‌మెంట కమిటీ సమావేశం ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగింది. కమిటీ సభ్యులు మల్టీ డిపార్టుమెంట్‌పై వివరించారు. ఇక్కడ ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఐఇడీ ఎజీఎం ఆంజనేయులు, మేనేజర్ రమేశ్, ఎస్ఓఎం అనిల్‌గబాలే, సీఎంవోఏఐ ప్రతినిధి పొనగోటి శ్రీనివాస్, ఎస్ఈ రాజన్న, ఏఐటీయూసీ ప్రాజెక్టు సెక్రటరీ ప్రభుదాస్, సంక్షేమాధికారి ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

దత్తసాయి జయంతి

జ్యోతినగర్(రామగుండం), డిసెంబర్ 12: రామగుండం రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 15న జరుగనున్న శ్రీ దత్తసాయి జయంతి ఉత్సవ ఆహ్వాన కరపత్రాన్ని సాయిబాబా మందిరంలో సాయిమందిర చైర్మన్, డివిజన్ కార్పొరేటర్ కన్నూరు సతీశ్‌కుమార్ విడుదల చేశారు. ఇక్కడ అర్చకులు రాంపెల్లి శ్రీనివాస్ శర్మ, సాయి మూలాధారణ భక్తులు కే తిరుపతి, ఎస్ శ్రీకాంత్, పూదరి శ్రీనివాస్, ఆడెపు అర్జున్, తూండ్ల శ్రీనివాస్, బీ రజిని, ఎ శోభ, టీ స్వప్న ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 12: గోదావరిఖనిలోని బాలికల హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ అబ్బ రమేశ్ గురువారం అవగాహన కల్పించారు. పరీక్షల సందర్భంగా ఒత్తిడికి గురి కాకుండా అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. ఇక్కడ దేవి లక్ష్మీనర్సయ్య, హెచ్ఎం మల్లేశ్, టీచర్ రమాదేవి ఉన్నారు.

సుల్తానాబాద్ రూరల్,డిసెంబర్ 12: గర్రెపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ మల్లన్న మాట్లాడారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థినులు భయపడకుండా (6303923700) నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.

అదానీ వ్యవహారంపై జవాబివ్వాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్12: అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఐబీ గెస్ట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో చాడ మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో ప్రతి పక్షపార్టీలు చర్చకు పట్టుబట్టినా ఎన్డీఏ ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తున్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిరుపేదలకు ఇస్తానన్నా ఇందిరమ్మ ఇండ్లు నేటికి ఇవ్వలేదన్నారు. అర్హులకు ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 26 నుంచి రాష్ట్రంలో జరిగే సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జిల్లా కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీనియర్ నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, కనకరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్, ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

నవ జంటకు ఆశీర్వాదం

జూలపల్లి, డిసెంబర్ 12 : జూలపల్లిలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లోక రమారవీందర్‌రెడ్డి కొడుకు సుదీర్‌రెడ్డి–సుస్మిత వివాహం గురువారం జరుగగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను వారు ఆశీర్వదించారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీలు కూసుకుంట్ల రమాదేవి, విశారపు వెంకటేశం, నాయకులు పొట్టాల మల్లేశం, కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్షకు తరలిరావాలి

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 12: ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తపస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షకు జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ముస్కుల సునీల్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద తపస్ ధర్మదీక్ష పోస్టర్‌ను యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర నాయకులు ఎలగం కనుకయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సతీశ్ బాబు, జిల్లా సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా మహిళా ప్రముఖ్ సుమిత్ర, కార్యదర్శి ఐలయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 12: బ్రాహ్మణపల్లికి చెందిన కొంకటి రాజమ్మ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు. విజిలెన్స్ ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు లింగమూర్తిని ఓదార్చారు.

వార్షిక లక్ష్యాలను సాధించాలి

రామగిరి, డిసెంబర్ 12: వార్షిక లక్ష్యాలను అధిగమించడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అంకితాభావం, భద్రతతో విధులు నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు అన్నారు. ఆర్జీ–3 ఓసీపీ–2 గనిలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంస్థ ప్రణాళికల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రామచంద్రారెడ్డి, రామారావు, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్ఓటు జీఎం రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, డీజీఎం చంద్రశేఖర్, పీఓ సుదర్శనం, ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ రామారావు, పిట్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 12 : సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. ఆర్జీ–2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో గురువారం మల్టీ డిపార్టుమెంట్ టీం ఆధ్వర్యంలో సంస్థ స్థితి గతులపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన మాట్లాడారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలకు యాజమాన్యం భూగర్భ గనుల్లో భారీ యంత్రాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం డివిజన్ కార్యదర్శి జీ రవీందర్, టీం సభ్యులు ఎం రాముడు, నర్సింహా రావు, అనిల్ కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉండాలి

దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఈఆర్ క్లబ్‌లో వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటలు, నృత్యాల పోటీలను జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు.ఎస్‌వోటు జీఎం రాముడు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి జీ రవిందర్, అధికార ప్రతినిధి అనిల్ కుమార్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జ్యోతినగర్, డిసెంబర్ 12: ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక అండ్ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన ఆకట్టుకుంటున్నది. గురువారం దాదాపు 100కు పైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. శుక్రవారం ఈ వైజ్ఞానిక ప్రదర్శన ముగియనున్నది.

పందుల పెంపకం దారులకు నోటీసులు

ముత్తారం, డిసెంబర్ 12: అడవి శ్రీరాంపూర్ గ్రామానికి ఇద్దరు పందుల పెంపకం దారులకు ముత్తారం పంచాయతీ సెక్రటరీ గురువారం నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలోని రెండో వార్డులో పందులు స్వైర విహారం చేస్తూ జనావాసాల ప్రాంతాల్లో మలమూత్ర విసర్జనలు చేయడమే కాకుండా అపరిశుభ్రం చేస్తూ, పసి పిల్లలపై దాడులకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సెక్రటరీ విచారణ చేపట్టి రెండో వార్డులో సంచరిస్తున్న పందులు అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కేతిరి సదానందం, భూమయ్య లకు చెందినవిగా గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు.